ఆ ఊరంతా కరెంట్ షాక్!

- ఏ వస్తువు పట్టుకున్నా షాక్
- భయాందోళనలో గ్రామస్తులు
- నిన్నటి రాత్రి నుంచి ఇదే పరిస్థితి
- ఇళ్లకు వెళ్ల లేక ఆరుబయటే గ్రామస్తులు
- అధికారుల దృష్టికి తీసుకెళ్లిన వైనం

ప్రజాశక్తి - వెదురుకుప్పం : ఆ ఊరంతా విద్యుత్ షాక్‌కు గురవుతు న్నారు. ఏ వస్తువు తాకినా విద్యుత్ సరఫరా అవుతుండడంతో ప్రజలు భయాందో ళనకు గురవు తున్నారు. మంగళవారం రాత్రి నుంచి వెదురుకుప్పం మండలం నల్లవెంగనపల్లి పంచాయతీ మిట్టూరులో ఈ పరిస్థితి నెలకొనగా బుధవారం వెలుగుచూసింది. ఆ ఊరి ఇంటి గోడలు, వస్తువులు, ఫర్నీచర్లకు కరెంట్ సరఫరా అవుతోంది. వాటిని పట్టుకుంటే విద్యుత్ షాక్‌కు గురవుతున్నారు. దీంతో ఏ వస్తువును పట్టు కోవాలన్నా మిట్టూరు వాసులు భయాందోళనకు గురవుతున్నారు. ఈ పరిస్థితి సంబంధిత విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లామని గ్రామస్తులు పేర్కొంటున్నారు. అయినా ఇప్పటి వరకు ఎలాంటి స్పందన లేదు. విద్యుత్ షాక్ భయంతో ప్రజలు ఇళ్లు విడిచి ఆరు బయటే కాలం వెళ్లదీస్తున్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖాధి కారులు స్పందించాలని మిట్టూరు ప్రజలు కోరుతున్నారు. అన్ని వస్తువులకు విద్యుత్ సరఫరా కావడానికి కారణమేమిటో తెలియక ఆ గ్రామస్తులు అయోమయంతో దిక్కులు చూ స్తున్నారు. తాము రోజూ నిర్వహించాల్సిన పనులు సైతం మానుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ సరఫరాను పూర్తిగా ఆపివేసి రాత్రి వేళలో నూనె దీపం వెలుగును ఆశ్రయించాల్సి వస్తోందని తెలిపారు.

మిట్టూరులో కరెంటు షాక్ కొడుతున్న వస్తువులు

సమాజ మార్పుకు అధ్యయనమే నాంది

సిపిఎం రాష్ట్ర నేత మిరియం వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల సిపిఎం నాయకులకు, కార్యకర్తలకు ఎనిమిది రోజులు పాటు తిరుపతి యశోద నగర్ లోని ఎంబి భవన్ లో నిర్వహిస్తున్న అధ్యయన క్యాంపునకు సిపిఎం జిల్లా నేత కేఎన్‌ఎం ప్రసాద్ రావు ప్రిన్సిపల్‌గా వ్యవహరించారు. అధ్యయన క్యాంపును ఉద్దేశించి సిపిఎం రాష్ట్ర నేత మిరియం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దేశంలో మతోన్మాద ప్రమాదాన్ని ఎదుర్కోవాలంటే పార్టీ శ్రేణులకు అధ్యయనం అవసరమని, సమాజ మార్పుకు నిత్యం పోరాడుతున్న సిపిఎం శ్రేణులు అధ్యయనాన్ని నిరంతరం చేపట్టాలన్నారు. మారుతున్న పరిస్థితులకు కనుగుణంగా పనిలో మార్పు రావాలని, అందుకు సైద్ధాంతిక స్థాయిని పెంచుకోవాలన్నారు. కేంద్రంలో, రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు అవుతున్న ప్రభుత్వాలు కార్పొరేట్లకు ఊడిగం చేసేవి తప్ప, ప్రజలకు మేలు చేసేవి కావని పేర్కొన్నారు. ప్రభుత్వ విధానాలపై అధ్యయనం చేయాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఎం తిరుపతి జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, సిపిఎం తిరుపతి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కందారపు మురళి, చిత్తూరు జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు, అన్నమయ్య జిల్లా నాయకులు చంద్రశేఖర్, రామాంజనేయులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర నేత మిరియం వెంకటేశ్వర్లు

ఏపి ఆర్ సెట్ ఫలితాలు విడుదల

ఎస్‌వియు పరిధిలో ఏపిఆర్ సెట్ ఫలితాలను విడుదల చేస్తున్న విసి ఆచార్య శ్రీకాంత్‌రెడ్డి

ప్రజాశక్తి- ఎస్‌వియు క్యాంపస్ (తిరుపతి): ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఏపిఆర్ సెట్ 2023-24ను మే నెల 2వ తేదీ నుంచి 5వ తేదీ వరకు నిర్వహించిన విషయం విధితమే. ఈ సెట్ ఫలితాలను బుధవారం 3 గంటలకు ఎస్వీయూ ఉపకులపతి ఆచార్య వి.శ్రీకాంత్ రెడ్డి విడుదల చేశారు. ఈ సందర్భంగా విసి ఆచార్య వి.శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ ఏపి ఆర్ సెట్ - 2023-24 మొత్తం 64 సబ్జెక్టులలో నిర్వహించడం జరిగిందని, మొత్తం 10050 మంది దరఖాస్తు చేసుకోగా 8651 మంది హాజరయ్యారని వారిలో 4352 మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. వీరిలో పురుషులు 2226 , స్త్రీలు 2126 వున్నారని తెలిపారు. ఎస్వీయూకు రీసెట్ 2023-24 నిర్వహణ బాధ్యతలు అప్పగించిన ఉన్నత విద్యామండలి వారికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. విజయవంతంగా సెట్ నిర్వహణ చేసిన కన్వీనర్ ఆచార్య దేవప్రసాద్ రాజును అభినందించారు. ఏపి ఆర్ సెట్ - 2023-24 కన్వీనర్ ఆచార్య దేవప్రసాద రాజు మాట్లాడుతూ వివిధ విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా వున్న 2728 పిహెచ్‌డి సీట్లకుగాను ఏపిఆర్ సెట్-2023-24 నిర్వహించామని, ఎంట్రన్స్ లో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు జూన్ 10 తర్వాత ఇంటర్వ్యూలు నిర్వహించి ర్యాంకులు ప్రకటిస్తామని తెలిపారు.ఫలితాలను https://cets.apsche.ap.gov.in వెబ్‌సైట్లో చూడవచ్చని అన్నారు. కార్యక్రమంలో ఆచార్య కిశోర్, ఆచార్య కుమారస్వామి, ఆచార్య కుసుమ హరినాథ్, కామేష్, నాగభూషణం, సుకుమార్, సునీల్ కుమార్ పాల్గొన్నారు.

శివయ్య ఆదాయం రూ.కోటీ 42 లక్షలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వర స్వామి అమ్మవార్లకు, పరివార దేవతలకు ముక్కంటి భక్తులు సమర్పించిన హుండీ ఆదాయం కోటీ 42 లక్షలా 89 వేలా 870 రూపాయలు వచ్చింది. స్థానిక శ్రీకాళహస్తీశ్వ రాలయంలో బుధవారం హుండీ లెక్కింపు జరిగింది. బంగారం 0.072 గ్రాములు, వెండి 487.800 కిలోలు, 124 విదేశీ కరెన్సీ నోట్లు వచ్చినట్లు వచ్చినట్లు ఈవో నాగేశ్వరరావు తెలిపారు.

పూతలపట్టులో గంజాయి జోరు!

- పెడదోవ పడుతున్న యువత
- చోద్యం చూస్తున్న పోలీసు అధికారులు
- అంధకారంలో బతుకులు

దేశానికి వెన్నెముకలా నిలవాల్సిన యువత.. తల్లిదండ్రుల ఆశయ సాధనకు అడుగులు వేయాల్సిన పుత్రులు.. వందేళ్ల జీవితాన్ని సాగించాల్సిన సాధకులు గంజాయి మత్తులో పడి పెడదోవ పడుతున్నారు. గంజాయి మత్తులో చేయరాని పనులు చేస్తూ తల్లిదండ్రులను శోకసంద్రంలోకి నెడుతున్నారు. విద్యను పక్కనపెట్టి చెట్ల కింద, పుట్ల కింద కాలాన్ని వెళ్లదీస్తున్నారు. పక్కదారి పడుతున్న యువతపై నిఘా వేసి సన్మార్గంలో నడపాల్సిన పోలీసు అధికారులు చోద్యం చూస్తుండడంతో యువత బతుకులు అంధకారంలోకి వెళుతున్నాయి.

ప్రజాశక్తి- పూతలపట్టు: చిత్తూరు జిల్లా పూతలపట్టు మండలంలో ఎక్కడా లేని విధంగా గంజాయి అమ్మకాలు కొనసాగుతున్నాయి. యథేచ్ఛగా రోడ్లపై గంజాయిని అమ్ముతున్నా పట్టించుకునే నాథుడే లేడు. దీంతో యువకులు అడ్డు అదుపు లేకుండా గంజాయికి బానిసలు అవుతున్నారు. గ్రామాల్లోని కొందరు 'పెద్దలు ఇదేమిటి?' అని నిలదీస్తే 'పోలీసులే పట్టించుకోవడం లేదు మీకేమిటి?' అని ఎదురు తిరుగుతున్నారు. దీంతో ఈ దుస్థితిని చూస్తూ ఉండడమే తప్ప ఏమీ చేయలేని నిస్సహాయ పరిస్థితి నెలకొంది. క్రికెట్ పేరుతో కొందరు గుంపులు గుంపులుగా వెళ్లడం, గంజాయి మత్తులో తూలి తూగుతున్నారు.

మతిస్థిమితం కోల్పోతున్న యువత

గంజాయికి బానిసలైన యువకులు మతిస్థిమితం కోల్పోయి రోడ్డు పాలవుతున్నారు. పూతలపట్టు మండల కేంద్రంలో ఇప్పటికే ముగ్గురు వరకు గంజాయి మత్తుకు బానిసలై మతి స్థిమితం కోల్పోయారు. మరి కొందరు మత్తులో నిత్యం గొడవలు చేస్తూ తల్లిదండ్రులకు నిద్రలేకుండా చేస్తున్నారు. గంజాయికి అవసరమైన డబ్బుల కోసం గృహాల్లోని విలువైన వస్తువులను అమ్ముతున్నారు. ఇటీవల గంజాయికి ఉపయోగపడుతుందని బానిసయిన వ్యక్తి ఏకంగా ట్రాక్టర్ నే చోరీ చేశాడు. పోలీసులకు పట్టుబడి కటకటాల పాలయ్యాడు. మంగళవారం గంగ జాతరలో ఒక యువకుడు గంజాయి సేవించి మత్తులో కనిపించిన వారిని చితక బాదాడు. దీంతో పోలీసులు రంగ ప్రవేశం చేయాల్సి వచ్చింది.

అడ్డాగా ప్రభుత్వ ఉన్నత పాఠశాల

మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల గంజాయి విక్రయానికి అడ్డాగా మారింది. మైదానంలో క్రికెట్ పేరుతో గుమి కూడడం.. చీకటి పడగానే మద్యం, గంజాయి సేవిస్తున్నారు. ఇక పాఠశాలల సెలవుల్లో అయితే గంజాయి బాధితులు మొత్తం ఉదయం నుంచి రాత్రి వరకు మైదానంలోనే గడుపుతున్నారు.

చోద్యం చూస్తున్న పోలీసు అధికారులు

మండల కేంద్రంలో గంజాయి మత్తులో పడిన యువకుల నుంచి అనేక సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. చోరీలు జరుగుతున్నా యథేచ్ఛగా రోడ్లపైనే గంజాయి అమ్మకాలు సాగుతున్నా పోలీసు అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారే తప్ప ఇందుకు సంబంధించి ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. యువత పక్కదారి పడుతున్నా పోలీసులు పట్టించుకోకపోవడంతో యువకుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ముగిసిన తిరుపతి గంగ జాతర

ప్రజాశక్తి- తిరుపతి టౌన్

తిరుపతి తాతయ్యగుంట గంగ జాతర బుధవారం ఉదయం అమ్మవారి చెంప నరకడంతో ముగిసింది. ఏడు రోజులుగా భక్తులు వివిధ రకాల వేషాలతో అమ్మవారికి మొక్కలు చెల్లించుకున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాతో పాటు కడప, ఇతర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఇవాళ ఉదయం పేరంటాల వేషం వేసుకున్న కైకాల వంశస్థులు అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. భక్తుల సమక్షంలో అమ్మవారి చెంప నరికి జాతర ప్రక్రియను ముగించారు. తిరుపతి ఆధ్యాత్మిక సౌందర్యాన్ని పొందింది. ఆంధ్రప్రదేశ్‌లో జరిగే ప్రసిద్ధ జాతరలలో తిరుపతి గంగమ్మ జాతర చాలా విశిష్టమైనది. ప్రతి సంవత్సరం మే నెలలో ఏడు రోజుల పాటు జాతర నిర్వహిస్తారు. ఈ జాతరకు వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు తరలివస్తారు. సంప్రదాయం ప్రకారం తిరుపతి గంగమ్మ జాతర సందర్భంగా ఈనెల 14న అర్ధరాత్రి కైకాల వంశస్థులు గ్రామంలో చాటింపు పూజలు నిర్వహించి నగర శివారులో చాటింపుతో జాతరను ప్రారంభించారు. జాతర ప్రారంభం కాగానే అమ్మవారి కపకుపాత్రులు కావాలని పూజలు నిర్వహించారు. జాతర 1వ రోజు బైరాగి వేషం, 16న బండ వేషం, 17న తోటి వేషం, 18న దొరవేషం, 19న మాతంగి వేషం, 20న సుననపు కుండలు, 21న గంగమ్మకు చప్పరంతో భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. జంతు బలిపై నిషేధం ఉన్నప్పటికీ ఆలయంలో ఓ మూలన ఇష్టానుసారంగా మేకలు, కోడిగుడ్లు నరికివేసేవారు. అలాగే గంగమ్మ దేవి జాతరలో మరో విశేషం కూడా ఉంది, జాతర జరిగినన్ని రోజులు గ్రామస్థులు ఊరు విడిచి వెళ్లరు. అలాగే ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వారు రాత్రి బస చేయకుండా వెళ్లిపోవడం ఇక్కడ ఆనవాయితీ. గంగమ్మ జాతరకు 900 సంవత్సరాల చరిత్ర ఉంది, గ్రామదేవతగా అవతరించిన గంగమ్మ తిరుమల శ్రీవారికి చెల్లెలు అని నమ్ముతారు.

తిరుపతి జాతరలో పుష్ప గెటప్..

తిరుపతిలో గంగమ్మ జాతర ఘనంగా ముగిసింది. రోజుకో వేషంలో ప్రజలు అమ్మవారిని దర్శించుకున్నారు. ఎర్రచందనం బ్యాక్ డ్రాప్ స్టోరీతో అల్లుఅర్జున్ పుష్ప సినిమా వచ్చింది. దానికి సీక్వెల్‌గా వస్తున్న పుష్ప-2లో బన్నీ తిరుపతి జాతర సందర్భంగా ఓ వేషం వేశారు. తాజా జాతరలో పలువురు భక్తులు బన్నీలాగే తయారై అమ్మవారిని దర్శించుకున్నారు.

గంగజాతర ప్రశాంతం : ఆరణి శ్రీనివాసులు హర్షం

తాతయ్యగుంట గంగమ్మ జాతర ప్రశాంతంగా ముగియడం పట్ల ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు హర్షం వ్యక్తం చేశారు. వేలాది మంది భక్తులు గంగమ్మకు ఇష్టమైన వేషాల్లో వారం రోజులపాటు కొలిచి మంగళవారం మొక్కులు చెల్లించుకోవడం సంతోషంగా ఉందని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి ప్రజలందరిపై గంగమ్మ ఆశీశ్శులు మెండుగా ఉండాలని కోరుకున్నట్లు ఆయన తెలిపారు. జాతర ప్రశాంతంగా ముగియడంలో గంగమ్మ గుడి ఆలయ అధికారులు, సిబ్బందికి, పోలీసులు, మున్సిపల్ కార్పోరేషన్ సిబ్బందికి ఆయన కతజ్ఞతలు తెలిపారు.

ఏపీ సీఎంతో సత్సంబంధాలు కొనసాగిస్తా..

తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి

ప్రజాశక్తి -తిరుమల: తెలంగాణ సీఎంగా ఏపీ సీఎంతో సత్సంబంధాలు కొనసాగిస్తానని రేవంత్ రెడ్డి అన్నారు. బుధవారం ఉదయం తిరుమల శ్రీవారిని రేవంత్ రెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆయనకు ఆలయాధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం ఆలయం ఎదుట మీడియాతో మాట్లాడుతూ ఏపీ సీఎంతో కలిసి సమస్యలు పరిష్కరించుకుని కలసికట్టుగా నడుస్తామన్నారు. రెండు రాష్ట్రాల అభివద్ధికి ఒకరికి ఒకరు సహకరించుకోవాలని ఆకాంక్షించారు. తిరుమలలో తెలంగాణ ప్రభుత్వం తరపున సత్రం, కళ్యాణ మండపం నిర్మిస్తామని ప్రకటించారు. శ్రీవారి సేవలో తెలంగాణ ప్రభుత్వ భాగస్వామ్యం కూడా తీసుకోవాలని ఏపీ సీఎంకు విజ్ఞప్తి చేస్తామన్నారు. రాజకీయాలపై విలేకర్లు ప్రశ్నించగా తిరుమలలో రాజకీయాలు మాట్లాడకూడదని చెప్పారు. రైతాంగాన్ని ఆదుకుని దేశ సంపదను పెంచాలని తమ ఆలోచన అని తెలిపారు.

గంగమ్మను దర్శించిన టిడిపి ఎంపీ అభ్యర్థి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చారిత్రక నేపథ్యానికి ఆనవాళ్లు జాతరలు అని టిడిపి కూటమి చిత్తూరు ఎంపీ అభ్యర్థి చిత్తూరు పార్లమెంటు అభ్యర్థి దగ్గుమళ్ళ ప్రసాదరావు అన్నారు. చిత్తూరులో నిర్వహిస్తున్న నడివీధి గంగమ్మ జాతరలో బుధవారం దగ్గుమళ్ళ ప్రసాదరావు పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే సీకే బాబు తనయుడు సి కె సాయి కృష్ణారెడ్డితో కలిసి ఆయన గంగమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ప్రసాదరావు మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సంప్రదాయాలతో పాటు ఆచార వ్యవహారాలను మేళవింపు చేస్తూ చిత్తూరులో నడివీధి గంగ జాతరను నిర్వహించుకోవడం మన సనాతన ధర్మాన్ని ఆవిష్కృతం చేసుకున్నట్లువుతోందన్నారు. ఇలాంటి జాతరలు భవిష్యత్తరాలకు దిక్సూచిగా నిలుస్తాయనడంలో సందేహం లేదని ఆయన తెలిపారు. ఈ నేపథ్యంలో మానవ సమాజాన్ని చల్లగా చూడాలని తాను అమ్మవారిని ప్రార్థించానని ఆయన తెలిపారు. సకాలంలో వర్షాలు కురిసి, పాడి పంటలు, సుఖ సంతోషాలతో ప్రజలు వర్ధిల్లేలా చూడాలని గంగమ్మ తల్లిని వేడుకున్నానన్నారు. గంగమ్మ తల్లి కృపతో దేశం, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని కోరుకున్నానని ప్రసాదరావు తెలిపారు. చిత్తూరులో నడివీధి గంగమ్మ జాతరను అనాదిగా నిర్వహిస్తున్న గంగ జాతర వంశపారంపర్య ధర్మకర్త, మాజీ ఎమ్మెల్యే సీకే బాబు ఆధునిక యుగానికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారని ప్రసాదరావు అన్నారు. ఈ సందర్భంగా మరోసారి చిత్తూరు పార్లమెంటు ప్రజలందరికీ గంగ జాతర శుభాకాంక్షలు తెలిపారు.

తెలుగు భాషపై శిక్షణ

మాట్లాడుతున్న తెలుగు ఉపాధ్యాయురాలు మునిలక్ష్మి

ప్రజాశక్తి -వెదురు కుప్పం, కార్వేటి నగరం : మండలంలోని (గ్రంథాలయంలో) నిర్వహి స్తున్న వేసవి శిక్షణ శిబిరంలో ఉపాధ్యాయులు కె మని లక్ష్మి బుధవారం తెలుగు వ్యాకరణంపై శిక్షణ ఇచ్చారు. తెలుగులో ఉన్న అచ్చులు హల్లులు, వ్యతిరేక పదాలు, అర్థాలు, సంధులు, సమాసాలు ఉపయోగాలు, వినియోగంపై వివరించారు. పద్యాల కు భావాలు తెలిపారు. తెలుగు వ్యాకరణ శాస్త్రాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి శంకర్ బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

అలరించిన అర్జున తపస్సు

ప్రజాశక్తి -కార్వేటినగరం: మండల పరిధిలోని కత్తెరపల్లి గ్రామంలో వెలసిన ద్రౌపదీ దేవి సమేత ధర్మరాజుల మహా భారత వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం నిర్వహించిన అర్జున తపస్సు ఏ ఎల్లప్ప, నరసప్ప కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు. అర్జున తపస్సు భక్తులను ఎంతో ఆకట్టుకుంది. వేదమ జాబుద అర్చకులు స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపి అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ద్రౌపదీదేవి ఉత్సవ మూర్తితో పాటు శ్రీకృష్ణ, భీమ, అర్జున, నకుల, సహదేవుల ఉత్సవ విగ్రహాలను గ్రామ వీధులలో ఊరేగించారు. అనంతరం మధ్యాహ్నం ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన అర్జున తపస్సుమాను వద్దకు చేరుకున్న అర్జున వేషధారి అర్జున తపస్సు ఘట్టానికి సంబంధించిన పద్యాలను ఆలపిస్తూ తపస్సుమాను అధిరోహించి కార్యక్రమాన్ని ప్రదర్శించారు. రాత్రి గోపిశెట్టి పల్లి గ్రామానికి చెందిన డాక్టర్ ఎస్. కె పళని రెడ్డి ఆధ్వర్యంలో నాటకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు ధనగిరిరెడ్డి. బాబురెడ్డి పలువురు భక్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అన్ని సౌకర్యాలు..

- ప్రిన్సిపాల్

ప్రజాశక్తి -చిత్తూరు డెస్క్: బంగారు పాళెంలోని పివిఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశా లలో అన్ని వసతులతో కళాశాల ప్రారంభం అవుతుం దని ప్రిన్సిపాల్ డాక్టర్ వందన త్రిపాఠి తెలిపారు. బుధవారం వారు విలేకరుల తో మాట్లాడుతూ ఈ సందర్భంగా మాట్లాడుతూ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో చేరే విద్యార్థులకు ప్రవేశాలు జరుగుతున్నాయని కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సిఇసి, హెచ్ ఈ సి, ఈ ఈ టి, సిరికల్చర్, ఏ అండ్‌టి కోర్సులు తెలుగు ఇంగ్లీష్ మీడియంలో కలవని కళాశాలలో తరగతి గదులు, ప్రయోగశాల, అనుభవం కలిగిన అధ్యాపకులు వున్నారని వివరించారు. ఆసక్తిగల విద్యార్థిని విద్యార్థులు కళాశాల సమయంలో సంప్రదించి కళాశాల వారికి కావలసిన కోర్సుల కోసం పేర్లు నమోదు చేసుకోవాలన్నారు పూర్తి వివరాలకు 9573744170, 9491976265 నెంబర్లను సంప్రదించాలన్నారు.

144 సెక్షన్ అమలులో వుంది: డిఎస్‌పి

ప్రజాశక్తి- సోమల: ఎన్నికల నియమావళి ప్రకారం మండలం లో144 సెక్షన్, 30 యాక్ట్ అమలులో ఉందని ఎన్నికల ఫలితాలు వచ్చేంతవరకు మండ లంలో ప్రశాంత వాతా వరణం నెలకొనేలా ప్రజలు సహకరిం చాలని ఎన్నికల ఫలితాలు వచ్చిన తరువాత కూడా ఎటువంటి ఊరేగింపులు ర్యాలీలు నిర్వహించకుండా గొడవలు ఘర్షణలు జరగకుండా సహకరించాలని గ్రామస్తులకు పలమనేరు డిఎస్‌పి విష్ణు రఘువీర్ సూచించారు. సోమల మండలం నంజంపేట, కమ్మపల్లి, సోమల గ్రామస్తులతో విష్ణు రఘువీర్ బుధవారం సమావేశం నిర్వహించారు. సమస్యాత్మక ప్రాంతాలుగా గుర్తించినందువల్ల నిరంతరం పోలీసుల పర్యవేక్షణ ఉంటుందని హద్దు మీరి ఎవరైనా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ వెంకట నరసింహులు, సిబ్బంది పాల్గొన్నారు.

గంగమ్మను దర్శించుకున్న మురళిమోహన్

ప్రజాశక్తి - తవణంపల్లి: గంగమ్మ జాతర ఉత్సవాల్లో భాగంగా పూతలపట్టు టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ కలికిరి మురళిమోహన్ గంగమ్మను దర్శించుకున్నారు. బుధవారం తవణంపల్లె మండల నాయకుల ఆహ్వానం మేరకు తవణంపల్లె మండల గంగమ్మ జాతర ఉత్సవాల్లో మురళిమోహన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా తవణంపల్లెలో కొలువుదీరిన గంగమ్మను మురళిమోహన్ దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అర్చకులు మురళిమోహన్ కు ఆశీర్వాదం అందించి అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో తవణంపల్లె మండల అధ్యక్షులు గాలి దిలీప్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్ చౌదరి, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చంగల్ రాయులుకు నివాళులు

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం : మండలంలోని నెలవాయి గ్రామంలో వైసిపి సీనియర్ నాయకుడు చంగల్ రాయులు అనారోగ్యంతో మృతి చెందారు. సమాచారం అందుకున్న స్థానిక సర్పంచ్ జయలక్ష్మి కుమార్ గౌడ్ , వైసిపి నాయకులు జనార్ధన్, ఉమాపతి, బాబు, రామకృష్ణయ్య ఆయన మృత దేహానికి బుధవారం పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యుల పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి సీనియర్ నాయకులు చెంగల్ రాయులు మృతి పార్టీకి తీరని లోటు అన్నారు. ఆయన వెంట వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికలు, కౌంటింగ్‌లో పోలింగ్ ఏజెంట్ల పాత్ర కీలకం

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: స్థానిక సంస్థలు, సార్వత్రిక ఎన్నికలు ప్రజాస్వామ్యంలో ఎలాంటి ఎన్నికలలో నైనా పోలింగ్ ఏజెంట్ల పాత్ర అత్యంత కీలకమైంది. పోలింగ్ సందర్భంగా దొంగ ఓట్లను గుర్తించడం, రిగ్గింగ్‌ను అరికట్టడం, ఒకరి పేరుతో మరొకరు ఓటు వేసేందుకు వస్తే గుర్తించి తిరస్కరించడంలో వీరి పాత్ర కీలకంగా ఉంటుంది. అందుకే రాజకీయ పార్టీలు తమకు అను కూలమైన, నమ్మకమైన వ్యక్తులను ఎన్నికల ఏజెంట్లుగా నియమిస్తుంటారు. పోలింగ్ సమయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో ఈవీఎంలను పరిశీలనకు ఓటరు నమోదు జీరో ఉన్నట్లు చూపిన తర్వాత పోలింగ్‌ను ప్రారంభించాల్సి ఉంటుంది. రాజకీయ పార్టీల ఏజెంట్ ఓటరు తిరస్కరిస్తే ఒకటికి రెండు పర్యాయాలు పరిశీలించి అర్హత ఉంటేనే ఓటుకు అనుమతించాలి. పోలింగ్ అనంతరం వీరి సమక్షంలోనే ఆ పోలింగ్ బూత్ లో ఎన్ని ఓట్లు నమోదు అయ్యాయనే విషయాన్ని ఏజెంట్ల సమక్షంలో నిర్ధారించి పోలింగ్‌ను ముగించాల్సి ఉంటుంది. ఏజెంట్ల సంతకాలతో ఆ పోలింగ్ బూత్ లో ఎన్ని ఓట్లు నమోదు అయ్యాయి అనే విషయాన్ని రాతపూర్వకంగా రికార్డు చేయాల్సి ఉంటుంది.

కౌంటింగ్ లోనూ ఏజెంట్ల పాత్ర కీలకం

కౌంటింగ్ ప్రారంభమానికి ముందు ఎన్నికల ఫలితాలు వెల్లడించే సమయంలో పార్టీ ఏజెంట్లు గమనించవలసిన అతి ముఖ్యమైన అంశాలు:

1) ఫారం 17సీ మీ దగ్గర వుంచుకోవాలి. ఎన్నికల అయిన తేదీ నాడే ప్రిసైడింగ్ అధికారి ఏజెంట్లతో సంతకం చేసిందే మీరు తీసుకోవాలి.
ఈ ఫారం 17సీ ఏజెంట్లు సంతకాలు లేనిదైతే ఏదో అవకతవకలు జరిగినట్లు భావించాలి.

2) ప్రతి పోలింగ్ కేంద్రం ఫారం 17 సీలో వున్న కంట్రోల్ యూనిట్ (సియు నెంబరు) , మిషన్ పై వున్న నెంబరు సరి చూసుకోవాలి. పోలింగ్ రోజున ఏదైనా సమస్య వచ్చినప్పుడు సీ.యు (కంట్రోల్ యూనిట్) మార్చినా అది ఫారం 17 సీ మార్చినట్లు చూపించి వుండాలి. ఒక వేళ ఆ నెంబరు మ్యాచ్ కాకపోతే కౌంటింగ్ ఆపి ఆర్ఓను సంప్రదించి కౌంటింగ్ ప్రారంభించాలి.

3) ఫారం 17సీలో నమోదైన ఓట్ల సంఖ్య, సీయు (కంట్రోల్ యూనిట్)లో చూపిస్తున్న ఓట్ల సంఖ్య సమానంగా వుండాలి. ఒక వేళ లేక పోతే రిటర్నింగ్ అధికారి అడిగి నివృత్తి చేసుకొన్న తర్వాత రిజల్ట్ కౌంటింగ్ ప్రారంభించాలి. ఈసారి ఆంధ్రప్రదేశ్ ఎన్నికలలో రెవెన్యూ వారు ప్రిసైడింగ్ అధికారులకు సరైన శిక్షణ లేని కారణంగా కొంత మంది ప్రిసైడింగ్ అధికారులకు సీఆర్‌సీ గురించి(క్లోజ్ రిజల్టు క్లియర్) అర్థం కాక పోవడం వల్ల కొంత సమస్య వచ్చింది. వాస్తవంగా ఏజెంట్లు సమక్షంలో మాక్–పోల్ జరిపి అందులో వున్న ఓట్లను సీ.ఆర్.సీ (క్లోజ్ రిజల్టు క్లియర్) చేసి వాస్తవ ఎన్నిక జరగాలి. ఒక వేళ సీఆర్‌సీ చేయని సందర్భంలో మాక్–పోల్ చేసిన ఓట్లను వి.వి.ప్యాట్ నుండి వేరు చేసి సీల్డ్ కవర్ (వైట్ బాక్స్)లో వుంచిన వాటిని లెక్కించి, సీయులో వాస్తవంగా పోల్ అయిన గ్రాస్ ఓట్ల నుండి తీసివేసి నికరంగా వచ్చిన ఓట్లను తుది ఓట్లుగా పరిగణించాలి.

4) కంట్రోల్ యూనిట్ కు వున్న అన్ని సీళ్లను ఫారం 17సీలో వున్న నెంబర్లతో సరిగా వున్నాయా? లేదా ఖచ్చితంగా సరిచూసుకోవాలి.

5) మిషన్ పైన సీళ్లు ఏవైనా చిరిగివున్నాయా లేదా సరిగ్గా వున్నాయా? తనఖీ చేసుకోవాలి. ఇది అతి ముఖ్యమైన అంశం.

6) కంట్రోల్ యూనిట్ (సియు)పై అన్ని సీళ్లపైన ఏజెంట్లు, అధికారుల సంతకాలు వుంటాయి. అవి సరిగ్గా వున్నాయా? లేదా సరిచూసుకోవాలి. అనుమానం వస్తే నివృత్తి చేసుకొన్న తర్వాతే కౌంటింగ్ ప్రారంభించాలి.

7) పోలింగ్ సమయంలో ఏదైనా పోలింగ్ కేంద్రంలో సాంకేతిక కారణాలతో మరో మిషన్ వాడివుంటే, వాటి వివరాలు కూడా ఫారం 17సి నమోదు చేసి వాటి వివరాలు కూడా సరి చూసుకోవాలి.

అతి ముఖ్యమైన విషయం రిజల్ట్ బటన్ నొక్కిన తర్వాత గుర్తించ వలసిన అంశాలు.

నియోజకవర్గంలో నోటాతో కలిపి పోటీ చేస్తున్న అభ్యర్థుల సంఖ్యను చూపించాలి.

9) పోలింగ్ కేంద్రంలో నమోదైన ఓట్ల సంఖ్య 17సీలో పోలైన ఓట్లతో సమానంగా వుండాలి.

10) కంట్రోల్ యూనిట్‌లో పోలింగ్ తేది, పోలింగ్ ప్రారంభం సమయం, పోలింగ్ ముగింపు సమయం గంటలు, సెకన్లతో సహా చూపిస్తుంది. వాటిని సరిచూసుకోవాలి.

11) పైన తెలిపిన అన్ని విషయాలపైన ఏజెంట్లు సంతృప్తి చెందితేనే ప్రతి రౌండ్ లో మీరు కౌంటింగ్ ప్రక్రియను ప్రారంభించడానికి సంసిద్ధత తెలపాలి.

ఓట్ల లెక్కింపుపై అవగాహన సమావేశం

మాట్లాడుతున్న పూతలపట్టు టిడిపి కూటమి అభ్యర్థి మురళిమోహన్

ప్రజాశక్తి- ఐరాల: వచ్చే నెల 4వ తేదీ నిర్వహించనున్న ఓట్ల లెక్కింపై కౌంటింగ్ ఏజెంట్లు , నాయకులు అనుసరించాల్సిన జాగ్రత్తలు, అప్రమత్తతపై పూతలపట్టు టిడిపి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ కలికిరి మురళిమోహన్ అవగాహన కల్పించారు. చిత్తూరు నగరంలోని భాస్కరా హోటల్‌లో పూతల పట్టు నియోజక వర్గం సమీక్షా సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో చిత్తూరు పార్లమెంటు అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాద్ రావుతో పాటు మురళిమోహన్ పాల్గొని ఓట్ల లెక్కింపు ప్రక్రియపై నాయకులకు అవగాహన కల్పించి సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా మురళిమోహన్ మాట్లాడుతూ ప్రసంగిస్తూ.. జూన్ 4వ తేదీ నిర్వహించనున్న ఓట్ల లెక్కింపు ప్రక్రియలో మెళకువలను వివరించారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియలో కౌంటింగ్ ఏజెంట్లు పాటించాల్సిన నియమాలను క్షుణ్ణంగా వివరించారు. కౌంటింగ్ ప్రక్రియ మొదలైనప్పటి నుండి ముగిసే వరకూ కౌంటింగ్ ఏజెంట్లు జాగ్రత్త వహించాలని మురళి మోహన్ సూచిం చారు. గడిచిన ఎన్నిక ల్లో పూతల పట్టు నియోజక వర్గం లో టిడిపి గెలుపునకై అహర్నిశలు శ్రమించిన నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు పేరు పేరునా మురళిమోహన్ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల పరిశీలకులు జనార్ధన్ రావు, బంగారుపాళ్యం మండల టిడిపి అధ్యక్షులు ఎన్‌పిజయప్రకాశ్, పూతలపట్టు మండల అధ్యక్షులు దొరబాబు చౌదరి, ఐరాల మండల అధ్యక్షులు గిరిధర్ బాబు, తవణంపల్లె మండల అధ్యక్షులు గాలి దిలీప్ కుమార్, యాదమరి మండల అధ్యక్షులు మురార్జీ యాదవ్, నియోజకవర్గం ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టోకెన్లు వున్న వారందరికీ వేరుశనగ విత్తనాలు పంపిణీ

చౌడేపల్లిలో వేరుశనగ విత్తనాల పంపిణీని పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

ప్రజాశక్తి - చిత్తూరు డెస్క్: టోకెన్లు కలిగి ఉన్న రైతులందరికీ వేరుశనగ విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు పుంగనూరు వ్యవసాయ సంచాలకులు శివకుమార్ అన్నారు. బుధవారం చౌడేపల్లి మండలంలోని చారాల, దుర్గ సముద్రం, పుదిపట్ల పంచాయతీ కేంద్రాల్లోని రైతు భరోసా కేంద్రాలలో వేరుశనగ విత్తనాలు అందించే ప్రక్రియను వారు పరిశీలించారు. 30 కిలోల బస్తా రూ. 1710 రూపాయలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి జ్యోతమ్మ , ఆర్ బి కే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి -పెద్దపంజాణి: మండలంలో సబ్సిడీ వేరుశనగ విత్తనాలు కావలసిన రైతులు ముందుగా వారి పట్టాదారు పాసుపుస్తకంతో రైతుబజారు కేంద్రంలో రిజిస్ట్రేషన్ తప్పని సరిగా చేసుకోవాలని సహాయ వ్యవసాయ సంచాలకులు సి.శివకుమార్ అన్నారు. బుధవారం మండలంలోని అప్పినపల్లి, వీరప్పల్లి, రాయలపేట, కమ్మపాళ్యం, పెద్ద వెలగటూరు రైతు భరోసా కేంద్రాలలో జరుగుతున్న సబ్సిడీ వేరుశనగ విత్తన కాయల రిజిస్ట్రేషన్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రాయలపేటలోని ఆర్ బి కే కేంద్రంలో రిజిస్ట్రేషన్ ను పరిశీలించి రిజిస్ట్రేషన్ పక్రియను స్థానిక ఆర్ బి కే అధికారి శ్రీనివాసులను రైతులు నమోదు చేసుకున్న వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024 సంవత్సరానికి మండలానికి 1980 క్వింటాళ్ల సబ్సిడీ వేరుశనగ విత్తనాలు వచ్చాయని విత్తనాలు తీసుకున్న ప్రతి రైతు తప్పకుండా వారి పొలంలో విత్తుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిని రకీభా ఆర్ బి కే సిబ్బంది పాల్గొన్నారు.

సుచి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గుండె వైద్య శిబిరం

ఉచిత వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

ప్రజాశక్తి -చిత్తూరు డెస్క్: సూచి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జోడి చింతల సుచి స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయంలో ఉచిత గుండె వైద్య శిబిరాన్ని ఆ సంస్థ డైరెక్టర్ గ్లోరీ విజయ్ కుమార్ బుధవారం ప్రారంభించారు. ఉదయం 9 గంటల నుండి 3 గంట వరకు గుండె వైద్య చికిత్స శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి 110 మంది హాజరయ్యారు. 20 మందిని ఆర్ ఎల్ జానప్ప నారాయణ హాస్పిటల్ కి పంపారు. ఈ సందర్భంగా కార్యనిర్వాహకులు మాట్లాడుతూ సుచి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో (ఆర్ ఎల్ జలప్ప) నారాయణ హార్ట్ సెంటర్ కోలార్ ఆసుపత్రి ఆధ్వర్యంలో గుండెకు సంబంధించిన ఈసీజీ ప్రథమ చికిత్స అందించారు. గుండె జబ్బు లాంటిది ఉందని నిర్ధారణ అయితే నారాయణ హాస్పిటల్ ఆధ్వర్యంలో వైయస్సార్ ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా చికిత్స చేసి ఆపరేషన్ చేయడం, ఉచిత వసతి ఏర్పాటు చేస్తున్నట్లు పిఆర్ఓ నరేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సుచి స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ పాల్ విజయ్ కుమార్, గ్లోరి విజయకుమార్, వైద్యాధికారులు డాక్టర్ కిరణ్ కుమార్, మనోజ్, స్టాఫ్ నర్స్ లు ఉష, , సుచి సిబ్బంది డి. చిన్నయ్య, వరద రాజులు, జాకబ్, సిబ్బంది పాల్గొన్నారు. వివరాలకు పి నరేష్ 9513314644 నెంబరును సంప్రదించాలని కోరారు.

ప్రతి ఒక్కరూ బీసీజీ వ్యాక్సిన్ తప్పక వేసుకోవాలి

వ్యాక్సిన్లపై అవగాహన కల్పిస్తున్న సిహెచ్‌వో లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి - చిత్తూరు డెస్క్: గ్రామీణ ప్రాంతాల్లోని అర్హులైన ప్రతి ఒక్కరికీ బిసిజి వ్యాక్సిన్ వేయాలని సిహెచ్ఓ లక్ష్మీనారాయణ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం ఉదయం యాదమరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో క్షేత్రస్థాయి సిబ్బందితో సమావేశమైన ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలు పైబడిన అందరూ వ్యాక్సిన్‌కి అర్హులన్నారు. మొదటి విడతగా 60 సంవత్సరాలు పైబడిన వారికి మాత్రమే ఈ వ్యాక్సిన్ వేస్తున్నామని ఆయన తెలిపారు. వృద్ధులలో ఈ వ్యాక్సిన్ వేయడం వలన క్షయ వ్యాధిని అరికట్ట వచ్చనే ఉద్దేశంతోనే వ్యాక్సినేషన్ వేయాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. ఆంధ్ర రాష్ట్రంలో పైలెట్ ప్రాజెక్టు కింద 13 జిల్లాలను ఎంపిక చేశారని అందులో మన చిత్తూరు జిల్లా ఒకటి అన్నారు. ఈ వ్యాక్సిన్ హెచ్ఐవి వారికి టీబీ వ్యాధి ఉండి మాత్రలు తీసుకుంటున్న వారికి, కదల లేకుండా బెడ్ పై ఉన్న వారికి వేయకూడదన్నారు. చక్కర వ్యాధి, అధిక రక్తపోటు లాంటి వారికి ఈ వ్యాక్సిన్ వేయవచ్చని ఈ విషయాలను గుర్తు పెట్టుకొని అర్హుల జాబితాను సిద్ధం చేసుకున్న మేర అందరికీ ప్రతి గురువారం నిర్దేశించిన ప్రాంతాల్లో వ్యాక్సిన్ వేయాలని సిహెచ్ఓ లక్ష్మీనారాయణ సూచించారు. ఈ కార్యక్రమంలో క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

రైతు భరోసా కేంద్రాలను తనిఖీ చేస్తున్న ఏడీఏ సుకుమార్

రైతు భరోసా కేంద్రాలను తనిఖీ చేసిన ఏడిఏ

ప్రజాశక్తి -గంగవరం: మండలంలోని కలగటూరు, గంద్రాజు పల్లి, పత్తికొండ, మామూడుగు, గంగవరం రైతు భరోసా కేంద్రాలను బుధవారం పుంగనూరు ఏడిఏ సుకుమార్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వేరుశనగ విత్తనాలను 40 శాతం సబ్సిడీతో పంపిణీ చేస్తోందని రైతులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గంగవరం మండలానికి 1,440 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు పంపిణీకి రెడీగా ఉన్నాయని, వేరుశనగ విత్తనాల పంటలు చేసిన రైతులకు మాత్రమే ప్రభుత్వం కేటాయించిన పథకాలు అందుతాయని అందుకే తప్పని సరిగా వేరుశనగ విత్తనాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. విత్తనాల నమోదు కార్యక్రమాలను పరిశీలించి భరోసా కేంద్రాల సిబ్బందికి సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సరిత పాల్గొన్నారు.

మరమ్మతుల అనంతరం పరిపాలన భవనంలోకి ప్రవేశించిన ఆలయ కమిటీ సభ్యులు,

పరిపాలన భవనంలో పూర్తయిన మరమ్మతులు

- సంప్రదాయబద్ధంగా ప్రవేశం

ప్రజాశక్తి - చిత్తూరు డెస్క్: ప్రకృతి వైపరీత్యం మూలంగా శక్తి క్షేత్రం బోయకొండ పరిపాలన భవనంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి వారం రోజులు తిరగక ముందే మరమ్మతులు చేశారు. ఆలయంలోని అమ్మవారి ప్రతిమ కలిగిన బోర్డులు, ఎలక్ట్రానిక్ వస్తువులు, కంప్యూటర్లు వంటివి అగ్ని ప్రమాదానికి గురై కాలిపోయాయి. దినంతటికీ బాధ్యత వహిస్తూ ఈవో చంద్రమౌళి తన సొంత నిధులతో మరమ్మతులు చేయించారు. కార్యాలయం పూర్వ స్థితికి తీసుకొచ్చి సంప్రదాయపద్ధంగా పూజలు నిర్వహించారు. బుధవారం కార్యాలయంలో సంప్రోక్షణ శుద్ధి , పుణ్యాహవచనం నిర్వహించి ప్రవేశం చేశారు. కష్టకాలంలో అండగా నిలిచిన వారందరికీ యు చంద్రమౌళి ధన్యవాదాలు తెలిపారు.

వైభవంగా ముగిసిన గంగమ్మ జాతర

ప్రజాశక్తి -కార్వేటినగరం: మండల పరిధిలోని ఆళత్తూరు గ్రామంలో వెలసిన నడివీధి గంగమ్మ జాతర బుధవారం ఘనంగా ముగిసింది. ఈ సందర్భంగా అమ్మవారిని మంగళవారం రాత్రి పట్టువస్త్ర, సుగంధ భరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో సుదరంగా అలంకరించి ప్రత్యేక వాహనంపై ప్రతిష్టించారు. అనంతరం అమ్మవారిని మంగళవాయిద్యాలు, బాణసంచాలు పేల్చి అంగరంగ వైభవంగా గ్రామ వీధులలో ఊరేగించారు. భక్తులు ఇంటింటా కర్పూర హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. మహిళలు అధిక సంఖ్యలో వెయ్యికళ్ల దుత్తలను మోసి అమ్మవారికి మొక్కులు సమర్పించారు. బుధవారం సాయంత్రం అమ్మవారిని డప్పు వాయిద్యాల నడుమ గ్రామంలో ఊరేగిస్తూ జలదికి తరలించారు.ఈ క్రమంలో భాగంగా అమ్మవారి ఆలయంతో పాటు, గ్రామ వీధులను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

వీరభద్ర స్వామి ఆలయంలో చోరీ

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మండల కేంద్రంలోని తీర్థం గ్రామ పరిధిలో నూతనంగా నిర్మించిన వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో చోరీ అయినట్లు ఆలయ ధర్మకర్త సుబ్రమణ్యం ఆచారి పేర్కొన్నారు. ఆయన కథనం మేరకు..యధావిధిగా రోజు లాగే మంగళవారం రాత్రి తొమ్మిది గంటలకు ఆలయం మూసివేసి తాళం వేసుకొని స్వగ్రామమైన తీర్థానికి వెళ్లానని, బుధవారం ఉదయం 8 గంటలకు ఆలయం వద్దకు రాగా వేసిన తాళాలు పగలగొట్టి ఉండటంతో గేట్ ఓపెన్ చేసి ఉందని, గర్భగుడి ఆలయ తాళాలు పగలగొట్టినట్లు గుర్తించామని తెలిపారు. విగ్రహాలను పరిశీలించగా గోవిందమ్మ మూల విరాట్ విగ్రహాలకు అలంకరించి ఉన్న బంగారపు మంగళ సూత్రం 12 గ్రాములు, రెండు జ్యోతులు గుడి ప్రారంభమైనప్పటి నుండి ఓపెన్ చేయకుండా ఉన్న హుండీని పగలగొట్టి అందులో ఉన్న సొమ్ము, హారతి ప్లేట్లు చోరీ అయినట్టుగా గుర్తించామని తెలిపారు. వాటి విలువ సుమారు లక్ష రూపాయలకు పైనే ఉండచ్చునని గుడి ధర్మకర్త సుబ్రహ్మణ్యాచారి తెలిపారు.

ఘనంగా గంగమ్మ నిమజ్జన వేడుకలు

ప్రజాశక్తి-పూతలపట్టు: మండల కేంద్రంలోని బజారు వీధిలో కొలువైన నడివీధి గంగమ్మ నిమజ్జన కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. మంగళవారం అమ్మవారిని ప్రతిష్టించగా బుధవారం భారీ బాణాసంచాలు మంగళ వాయిద్యాలు మధ్య నిమజ్జనానికి వెళ్లారు. యువకులు రంగులు పూసుకుంటూ నిమజ్జన కార్యక్రమంలో ఉత్సాహంగా కనిపించారు.



నిమ్మకాయపై గంగమ్మ చిత్రం

ప్రజాశక్తి -చిత్తూరు డెస్క్: యాదమరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆర్ట్ మాస్టర్ కె.దామోదరాచారి చిత్తూరు గంగమ్మ జాతర సందర్భంగా ప్రత్యేకంగా నిమ్మకాయపై గంగమ్మ చిత్రాన్ని చిత్రిం చారు. ప్రత్యేక సందర్భాలలో చిత్రకారుడిగా కె.దామోదరా చారి వైవిధ్యంతో కూడిన చిత్రాలను రూపొందించడం విశేషం. గతంలో వేపాకుపై గంగమ్మ చిత్రం, టెంకాయపై గంగమ్మ చిత్రం చిత్రించి ఆకట్టుకున్నారు. ఈ సంవత్సరం జాతరకు అమ్మవారికి ఎంతో ముఖ్యమైన నిమ్మకాయపై గంగమ్మ చిత్రాన్ని రూపొం దించడం సందర్భోచితంగా, అద్భుతంగా ఉందని పలువురు ప్రశంసించారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు: తహశీల్దారు

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల అధికారి నియమావళి ప్రకారం చిత్తూరు కలెక్టర్ ఆదేశాల మేరకు పెట్రోల్ బంక్, టపాసులు షాప్ యజమానులకు ఓట్లు లెక్కింపు చర్యలు పూర్తయ్యే తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు పెట్రోల్ బంకు యజమానులు కంటైనర్ బాటిల్స్, డ్రమ్స్ ఇతర ఏ పాత్రలకు పెట్రోలు, డీజిల్ సరఫరా చేయడం లైసెన్స్ నిబంధన ఉల్లంఘన అవుతుందని వాహనాలకు మాత్రమే పెట్రోలు డీజిల్ నింపాలని ఎస్ఆర్ పురం తహశీల్దారు ధోని ఆల్ఫ్రెడ్, ఎంపీడీవో మోహన మురళి పేర్కొన్నారు. మండలంలోని పెట్రోల్ బంకులను బుధవారం వారు సందర్శించి పెట్రోల్ బంకు, టపాసు షాపుల యజమానులకు నోటీసులు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మీ పరిధిలో ప్లేయింగ్ స్క్వాడ్ ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేసిందని ఎన్నికల కోడ్‌ను ఎవరైనా ఉల్లంఘిస్తే పెట్రోల్ బంకు సంబం ధించిన లైసెన్సును రద్దు చేస్తామని హెచ్చరించారు. చొక్కా మడుగు వద్ద గల టపాకాయలు విక్రయ కేంద్రం వద్దకు వెళ్లి కౌంటింగ్ ప్రక్రియ ముగిసే వరకు ఎలాంటి టపాకాయ విక్రయా లు నిర్వహించ కూడని నోటీసులు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ ప్రభాకర్, గ్రామ పంచాయతీ కార్యదర్శి కోదండరామిరెడ్డి, వీఆర్వో లు ప్రశాంత్, చంద్రబాబు, రవి పాల్గొన్నారు.

ఎస్ఆర్ పురంలో నోటీసులు అందిస్తున్న తహశీల్దారు ధోని ఆల్ఫ్రెడ్, ఎంపీడీవో మోహన మురళి

సోమల: మండలంలోని టపాసుల విక్రయ లైసెన్స్ దారులు ఎన్నికల ఫలితాలు వచ్చేంతవరకు తమ వద్ద ఉన్న టపాసులను విక్రయించరాదని తహశీల్దార్ నాగరాజు సూచించారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో తమ వద్ద ఉన్న స్టాకును, రికార్డు నమోదు చేసి సీల్ చేసి న అనంతరం ఆదేశాలు వచ్చేవరకు విక్రయాలు చేపట్ట రాదని స్పష్టం చేశారు. తహశీల్దార్ కార్యాలయంలో మండలంలోని ఏడు గురు టపాసుల విక్రయ లైసెన్సుదారులతో సమావేశాన్ని నిర్వహించారు. మండే స్వభావం కలిగిన టపాసులను ఎన్నికల ఫలితాలు వచ్చేవరకు విక్రయించరాదని ఆదేశాలున్న కారణంగా ఎవరు కానీ విక్రయాలు జరపరాదన్నారు. తమ వద్ద ఉన్న స్టాకును అధికారుల సమక్షంలో రికార్డు నమోదు చేసి సీలు వేసి తదుపరి ఆదేశాల అనంతరం విక్రయాలు జరుపుకోవచ్చుని తెలిపారు. కార్యక్రమంలో డిటి రామమూర్తి, టపాసుల విక్రయ లైసెన్సుదారులు పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లి: మండలంలోని పుంగనూరు రోడ్లో గల ఇండియన్ . హెచ్ పి., ఆంధ్ర కర్ణాటక సరిహద్దులో బైపల్లి గ్రామంలో ఉన్న పెట్రోల్ బంక్ ల వద్దకు తహశీల్దార్ స్వర్ణలత ఎంపీడీవో జీ.వి.రాజేష్ వెళ్లారు. ఎన్నికల అధికారి కలెక్టర్ ఆదేశాల మేరకు పెట్రోబంక్ యజమానులు ఎన్నికల ఫలితాలు వచ్చే వరకూ బాటిల్స్, క్యాన్లలో పెట్రోల్, డీజిల్ విక్రయించకూడదని ఆదేశించారు వాహనాల్లో మాత్రమే పెట్రోల్ డీజిల్ ట్యాంకులకు నింపాలని ప్లాస్టిక్ బాటిల్స్, ప్లాస్టిక్ క్యాన్లలో పెట్రోల్ డీజిల్ నింపకూడదని సూచించారు.

రామకుప్పం: జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆదేశాల మేరకు పెట్రోల్ బంకుల్లో ఎన్నికల కోడ్ నియమాలను తప్పనిసరిగా పాటించాలని తహశీల్దార్ శ్రీనాథ్ పేర్కొన్నారు. బుధవారం రామకుప్పంలోని ఇండియన్ పెట్రోల్ బంక్ ఆయన పరిశీలించారు. ఎన్నికల కోడ్ ఉన్నంతవరకు పెట్రోల్ ,డీజిల్ ను బాటిళ్లు, డ్రమ్ములు తదితర వాటిలో విక్రయించరాదని పెట్రోల్ బంక్ సిబ్బందికి సూచించారు. వాహనాలకు మాత్రం పెట్రోల్, డీజిల్ సరఫరా చేయాలన్నారు. ఎన్నికల కోడ్ ను ఉల్లంఘిస్తే బంకు బి ఫారం లైసెన్స్ రద్దుకు సిఫారసు పంపుతామన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ వెంట విఆర్ఓలు మహేష్, రాజేష్, విఆర్ఎ రమణ పాల్గొన్నారు.

సోమలలో

రామకుప్పంలో